
# అంతర్వాణి



పానుగంటి వెంకటరమణి

వులిక్కిపడింది విజయ.

"అరవై ఏళ్ళా?" నమ్మలేనట్లు కంగారుగా అడిగింది. మేనమామయ్య శేషాద్రిని.

అవునన్నట్లు తలూపాడు శేషాద్రి. జేబులోంచి చుట్టతీసి నిప్పంటిస్తూ.

పూర్తిగా పద్దెనిమిదేళ్ళయినా నిండని పార్వతక్కయ్యకు అరవై ఏళ్ళ ముసలాడితో పెళ్లా? ఏమిటిది? మామయ్య నిజమే చెబుతున్నాడా? అసహ్యంగా చూసింది శేషాద్రి వంక.

"ఏమిటే అలా చూస్తున్నావు... ఓహో ముసలాడనా? అయితేనేం లక్షణంగా అయిదు లక్షల ఆస్తి. పెద్దమేడ పైగా ముసలాడు, రేపోమాపో రాలిపోయే ఎండుటాకు... జాగ్రత్తగా విను. వాడు కాస్తా రాలిపోతే అయిదులక్షల ఆస్తికి మీ అక్కయ్యే అధికారిణి అవుతుంది. ఆ తరువాతంటావా? మారు మనువు చేసుకోడం మనలో వుండనే వుందిగా... ఏమంటావ్?" అంటూ తలుపుచాటునుండి వింటున్న పార్వతివంక చూశాడు.

తలుపుచాటునుండి వెళ్ళిపోయింది పార్వతి!

మావయ్య దురాలోచనకు విభ్రాంతిపోయింది విజయ.

ఛీ...ఛీ... ఎంత భయంకరమైన ఆలోచన ఇన్నాళ్ళు మావయ్యలో ఇంత స్వార్థం కరుడు కట్టుకు పోయిందా? తమ జీవితాలతో వ్యాపారం చెయ్యడానికేనా యిన్నాళ్ళు ఇంతయిదిగా పెంచింది. తమని చేరదీయడంలో గల ఆంతర్యం యిదా? ఎలాగయినా ఈ అన్యాయం జరగనీయ కూడదు. ఆదిలోనే దీన్ని అంతం చెయ్యాలి' అనుకొంది విజయ.

"ఏమిటి మావయ్యా నువ్వంటున్నది? వెధవ డబ్బుకోసం బంగారంలాంటి అక్కయ్య బతుకు నాశనం చేస్తావా! వీల్లేదు... అలా జరగడానికి వీల్లేదు." అంది విజయ.

"ఏమిటే ఆ మాటలు. మీ అక్కయ్య సుఖం కోసం కష్టపడి ఈ సంబంధం తెస్తే ఇదా నువ్వు అనవలసింది? కావాలనుకుంటే మాత్రం అబ్బ

తుంటేనే ఆ అక్కయ్యకు ఇంత నిరి?" పైట కొంగుతో చేతులు తుడుచుకుంటూ అక్కడకివచ్చిన మేనత్త కామాక్షమ్మ అంది తలను వెనకేసుకొస్తూ.

"ఆ సిరి మాకేం అక్కర్లేదు. ఇష్టంలేని పెళ్ళి అక్కయ్యకు చెయ్యకుండావుంటే అంతేచాలు" ఖచ్చితంగా అంది విజయ.

అంతవరకు మౌనంగా వున్న శేషాద్రి కలుగజేసుకున్నాడు.

"ఏమిటే నీ పెత్తనం తెలిసి, అంత ప్రతిది యిష్టం లేదని చిన్నప్పుడు గారాం చేసేవాళ్ళు... అలాని పూడుతున్నావా! అసలు ఇదం చేసి అన్నీ అమర్చి పెడితేగాని యింట్లోవాళ్ళకు నచ్చదు. ఇది కూడా అలాగే ఆ యిష్టాన్ని వదిలేయమంటున్నాను!" చుట్టపొగ గుప్ గుప్‌మని వదులుతూ తన తెలివితేటల్ని మాటల్లో పొందుపర్చి చెప్పాడు శేషాద్రి.

వెనకోపక్కవంక కొరకొరా చూసింది కామాక్షమ్మ.

"మావయ్యా తెలియని పసితనంలో సరదాగా వుంటాని నిప్పుతో ఆడుకోవాలనుకునేవాళ్ళం. అది కాలుతుందని తెలిసిన తరువాత కూడా దాన్ని అరచేతిలో పెట్టుకోవాలనుకునే మూర్ఖులు వుండరనుకుంటాను," అంది విజయ.

తన మాటలు తనకే త్రిప్పికొట్టేసరికి కోపంతో రెచ్చిపోయాడు శేషాద్రి.

ముక్కుమీద వేలు వేసుకుంది కామాక్షమ్మ.

"నే నప్పుడే చెప్పాను ... యీ దిక్కుమాలిన వాళ్ళను నెత్తిన పెట్టుకోవద్దండీ అంటేవింటేనా?" సాగదీస్తూ అంది కామాక్షమ్మ గతాన్ని శేషాద్రి గార్కి గుర్తుచేస్తున్నట్టు

విజయ కోపంతో వుడికిపోయింది.

"మీరేం పూరికినే నెత్తిన పెట్టుకోలేదు. మా ఆస్తికి ఆశపడి..."

"నోర్మూయ్...!" విజయ మాటల్ని మధ్యలోనే ఖండిస్తూ అరిచాడు శేషాద్రి.

"ఎపపేసే వున్నమతి పోయిందని ... నోటికొచ్చినట్టు వాగుతున్నావు. ఏముందే మీ ఆస్తి" అన్నాడు శేషాద్రి చుట్టను దూరంగా విసిరేస్తూ.

"ఎందుకు లేదూ. యిప్పుడు మీరనుభవిస్తున్నదంతా మా ఆస్తే! అయినా యిపుడా గొడవలన్నీ అనవసరం. చివరిసారిగా అడుగుతున్నాను. నీ ప్రయత్నం విరమించుకో మావయ్యా!" అంది విజయ.

"వీల్లేదు! ఈ పెళ్ళి జరిగి తీరవల్సిందే" ఖచ్చితంగా చెప్పాడు శేషాద్రి.

"అదీచూస్తాను నాకంఠంలో ప్రాణముండగా...

ఆవేశంతో అక్కడ నిలవలేకపోయింది విజయ విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

"చూస్తానే నీసొగసేమిటో నీవరకూ వస్తేనేగాని తెలియదు ఈ శేషాద్రి సంగతి. అన్నాడు మీసాలు మెలేస్తూ.

"చూశారా! మంచి చేస్తూ ఎన్ని మాటలు పడుతున్నారో ... అంతే యీ రోజుల్లో ... లేవండి భోంచేద్దురుగాని" భర్తపట్ల సానుభూతి చూపిస్తూ అనునయ వాక్యాలు పలికింది కామాక్షమ్మ.

భోజనానికి సిద్ధపడ్డాడు శేషాద్రి.

* * *

ఆరోజు సాయంత్రం

శేషాద్రికొడుకు మూర్తి పట్నంనుంచివచ్చాడు.

"ఏరా ఉత్తరమన్నా లేకుండా ఇలా వూడిపడావ్?" అడిగాడు శేషాద్రి.

"అనుకోకుండా వారంరోజులు ఆఫీసు శెలవులిచ్చారు నాన్నా! మిమ్మల్ని చూసివెళదామని వచ్చేశాను."

"అలాగా! సరేలే వస్తే వచ్చేవులేగాని మంచి సమయానికే వచ్చావు. పార్వతి పెళ్ళికి టాంబూలాలు పుచ్చుకోవడానిక్కి పెళ్ళివారొస్తున్నారు రేపు నువ్వు స్టేషన్‌కి వెళ్ళవుగాని" అన్నాడు శేషాద్రి.

"వండర్‌ఫుల్! పార్వతి పెళ్ళన్నమాట. అయితే మంచి సమయానికే వచ్చాను. వెరీగుడ్! ఏది పెళ్ళికూతురు" అంటూ పార్వతివున్న వంటగదివైపు దారితీశాడు మూర్తి.

* * *

మావయ్యతో పోట్లాడి వచ్చిన తరువాత విజయ మంచంమీద పడుకుని శూన్యంలోకిచూస్తూ చాలాసేపు ఆలోచించింది. సాటి ఆడది రక్తం పంచుకు పుట్టిన సోదరికి జరగబోతున్న అన్యాయాన్ని ఎలా అరికట్టాలో ఆమెకు అర్థంకాలేదు.

> **గాంధీజీ సూక్తి**
>
> జీవితాన్ని అనేకమైన శక్తులు పాలిస్తాయి. వర్తింపచేయడానికి క్షణం ఆలోచనకూడా అక్కర్లేని ఒక సాధారణ సూత్రమే ఒకని చర్యలను నిర్ణయింప గలిగితే, అది మృదువుగా సాగే జీవితయానమే. కాని అంత తేలిగ్గా నిర్ణయించగలిగిన ఏ ఒక్క చర్య కూడా నాకు స్ఫురణకు రావడంలేదు.
>
> — మహాత్మాగాంధీ

మనస్సంతా తెగని ఆలోచనలతో సతమతమయిపోయింది. పదే పదే పార్వతి అమాయకస్వరూపం కళ్ళముందు కదలసాగింది. పెళ్ళిపీటలమీద కూర్చుని అక్క తనవైపు దీనంగా చూస్తున్నట్లు వూహించుకొని భోరున ఏడ్చింది.

గది విడిచి భోజనానికికూడా బయటకు వెళ్ళలేదు. ఇంట్లో ఎవరూ విజయను భోజనానిక్కి పిలవలేదు. మూర్తి ఒకసారివచ్చి పలకరించి వెళ్ళాడు.

అంతా ఏదో చికాకుగా వుంది.

చీకటి పడింది.

గ్లాసులో పాలుపుచ్చుకుని వచ్చింది పార్వతి.

"విజ్జీ!" అంటూ లైటువేసి.

"చీకట్లో కూర్చుని ఏం చేస్తున్నావ్?" అంది పార్వతి పాలగ్లాసు బల్లమీద పెడుతూ.

పార్వతి గొంతు ఎంతో బాధతో వినిపిస్తుందనుకొంది విజయ.

తనకు జరగబోయే అన్యాయాన్ని గురించి తనతో చెప్పి తనని వాటేసుకుని భోరున ఏడుస్తుందని తరువాత యిద్దరూ కలిసి ఏదైనా ఆలోచించి ఒక నిర్ణయానికి రావాలని అంతసేపూ ఆలోచిస్తున్న విజయ, తన ఆలోచనలకు భిన్నంగా జరిగేసరికి ఆశ్చర్యంగా తలెత్తి పార్వతి ముఖంలోకి చూసింది.

ఎప్పటిలా ప్రశాంతంగా వుంది పార్వతి.

ఆమెకళ్ళలో బాధకాని ఆందోళనకాని ఏ కోశానాలేవు. ఎప్పటిలా నిండుగావుంది.

ఇంత జరుగుతున్నా ఆమె అలా ఎలా వుండగలిగిందో అర్థంకాలేదు విజయకు.

"అక్కా" బాధగా పిలిచింది విజయ.

ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా విజయ ముఖంలోకి చూసింది పార్వతి.

"ఆదే అక్కా నీ పెళ్ళి సంగతి."

"ఆఁ?"

"నీకు తెలుసా?"

"తెలుసు."

"తెలిసే ఇలా వూరుకున్నావా!"

"వూరుకోక చేసేదేముంది."

"ఇష్టంలేదని చెప్పకూడదూ."

"నువ్వు చెప్పావుగా."

"అదికాదక్కా...!"

"చూడు విజ్జీ! మావయ్య ఇలాంటివాడని మనకింత వరకూ తెలియదు. తెలిసిన తరువాత ఆయనతో వాదించేకంటే మన తలరాత యింతేనని వూరుకోవటం మంచిది. ఆడవాళ్ళం అంతకంటే మనం చేసేదేముంది."

"ఆడవాళ్ళం! అలా అనుకోవడమే మన దౌర్బల్యం ఆడవాళ్ళయినంత మాత్రాన మనం మాత్రం మనుష్యులం కాదు! అమ్మ కడుపున పుట్టలేదా! మనకు మాత్రం ఆశలు, ఆశయాలు వుండకూడదా! అవి సాధించుకునే హక్కు లేదా! ఈ మగాళ్ళు చెప్పినట్టు వినడమేనా మన పని! ఛీ... ఛీ... మారుతున్న సమాజం అంటారు ఇదేనా?" రోషంగా అంది విజయ.

"పిచ్చీ! ఎందుకే అలా బాధపడతావు. దైవ నిర్ణయం ఎలా వుంటే అలా జరుగుతుంది. మావయ్య మనల్ని శాసించగలడేమోగాని దైవాన్ని శాసించలేడుగా. ఈ రోజు మనం అనుకొనిదేదో జరిగినట్టే రేపు మావయ్య అనుకోనిది మరోటి జరగవచ్చు. విధిని మనం తప్పించలేముగా." దైవంమీద దృఢవిశ్వాసంతో పలికింది పార్వతి.

"విధి! విధిమాటటుంచి ఇలా జరగడం నీకిష్టమా?" కోపంగా అడిగింది విజయ.

"మన యిష్టంతో నిమిత్తంలేని విషయం గురించి చర్చించటం కాదనడం కంఠశోషే అవుతుంది.

... చూడు విజ్జీ ఆలోచనలతో మనసు పాడుచేసుకోక పాలు త్రాగి హాయిగా నిద్రపో" అంటూ వెళ్ళిపోయింది పార్వతి.

ప్రక్కవాటుగా అక్కా చెల్లెళ్ళ సంభాషణవిన్న శేషాద్రి మీసాలు త్రిప్పుకున్నాడు.

పార్వతి వెళ్ళిపోయింది.

కాని విజయకు నిద్రపట్టలేదు.

పెక్కు ఆలోచనలు ముసురుకున్నాయి.

అక్కయ్యమిటి ఇలా అంటుంది? బహాటా ఎదిరించే ధైర్యం లేకనా? ఎదిరించినా గెలవలేమనే నిరాశ చేతనా? అంతా విధి అంటూ తల ఒగ్గాలనుకొంటుందా. అక్క ఆ కోపము చెందుతుందేనా? కోరి కష్టాలను ఆహ్వానిస్తున్నదా? అరవై ఏళ్ళ ముసలాడితో కాపురం ఎన్నేళ్ళకే వైధవ్యం! వసంతంలో వాడిపోయే పుష్పంలాంటి జీవితం! ఇదేనా అక్కయ్య ఆశించేది? ఏమిటి అక్కయ్య ఆంతర్యం? కాదు... అక్క వట్టి అమాయకురాలు. తనే దీనికో పరిష్కారమార్గం ఆలోచించి అక్కను కాపాడాలి.

ఎలా? ఎలా? ఎంత ఆలోచించినా అంతు చిక్కలేదు. మస్తిష్కం వేడెక్కి పోయింది.

ఒకవేళ మూర్తితో ఆలోచిస్తే ... అతని సహాయం అడిగితే! అసలు మూర్తి బాగా చదువుకున్నవాడు. తప్పకుండా సహాయం చేస్తాడు.

ఆ ఆలోచన రాగానే మంచం మీదనుంచి లేచింది.

అంతలో ...

మూర్తి అటుగా వచ్చాడు.

"బావా!" నెమ్మదిగా పిలిచింది విజయ.

"ఏం చినమరదలా నీ పెళ్ళెప్పుడు" అంటూ గదిలోకి వచ్చి కూర్చున్నాడు మూర్తి.

విషయం ఎలా చెప్పాలా అని రెండు నిముషాలు తటపటాయించింది చివరకు—

"విన్నావా బావా?" అంది విజయ.

"ఆఁ విన్నాను. విన్నాను మీ అక్క పెళ్ళి కాబోతోందని అదేనా?"

"అవే మూడో పెళ్ళి ముసలాడితో."

"అయితేనేం...లక్షలు"

"లక్షలు...మీ అందరికి లక్షలే కంటికి కనబడుతున్నాయి. వాటివెనక వున్న నరకం కనిపించటం లేదు. ఆడదాని సుఖానికి కావల్సింది కేవలం డబ్బేనా?"

"నాకు తెల్సినంతవరకూ అంతేమరి."

"ఏమిటి బావా! చదువుకున్నవాడివి నువ్వు కూడా అదే మాటంటావా? చూడు బావా జీవితంలో నేను నిన్నేది కోరలేదు.

ఇపుడు చేతులు జోడించి అర్థిస్తున్నాను. మా అక్కయ్యను ఈ ఆపదనుంచి కాపాడు. ఈ పెళ్ళి తప్పించడానికి మార్గమేదయినా వుంటే ఆలోచించు" దీనంగా అర్థించింది విజయ.

"అమ్మయ్యో! పెళ్ళితప్పే మార్గమే...అంటే ...మా నాన్నను కాదని ఎదిరించటమన్నమాట. అంత ధైర్యం నావద్దలేదు మరదలా!" బెదురుగా అన్నాడు మూర్తి.

"మగాడివి! అమాయకురాలయిన ఒక ఆడదాని జీవితం కాపాడలేవా?"

"నా వల్లకాదు!" ఖచ్చితంగా చెప్పేశాడు మూర్తి.

ఇంకా ఏదో అనబోయింది విజయ. ఇంతలో శేషాద్రి గదిలోకి రావడంచూసి ఆగిపోయింది.

"చూశావా! విజయా వాడికెలా యిస్తుంది పెట్టి లాభంలేదు. ఎంతయినా వాడు నా కొడుకు. ఇక ఏ మొక్క లబ్బకేదే వాళ్ళెవరూ లేరిక్కడ. ఇంతవరకూ చేసిన ప్రయత్నాలు చాలుగాని పోయిరా నిద్రపో! రేపు మీ అక్కయ్యను పెళ్ళికూతుర్ని ముస్తాబు చేయాలి" అంటూ కొడుకుతోసహా నిష్క్రమించాడు శేషాద్రి.

నిరాశతో దుఃఖంగా కూలబోయింది మంచంమీద విజయ. ఏదో చెయ్యాలనే ఆవేశం! కాని చేసే మార్గంలేదు. తలపట్టుకుంది.

పిచ్చిపిచ్చి నిద్రపోయింది.

పీడకలలతో రాత్రి దొర్లిపోయింది.

• • •

తెల్లవారింది......

విజయ కళ్ళు విచ్చింది.

ఎర్రగా వాచి వున్నాయి.

తలగడమీద కన్నీటి మరకలు.

చెంపలపై కన్నీటి చారలు.

వరండాలో కామాక్షమ్మగారి కేకలు.

ఎడమకన్ను అదిరింది.

నెమ్మదిగా లేచి కూర్చుంది.

"పార్వతి కనిపించటంలేదు" కామాక్షమ్మగారి మాటలు సూటిగా విజయ చెవులను తాకినవి. గాలి రాగా లేచి నిలబడింది. గబగబా గది బయట కొచ్చింది.

ఏదో తెలియని ఆతృత...ఆందోళన మనసులో ప్రవేశించింది.

అక్క ఏదయినా అఘాయిత్యం... ఆ తరువాత మనసు భరించలేకపోయింది.

"మూర్తి ఏం చేస్తున్నాడు" కండువా భుజాన వేసుకుంటూ అడిగారు శేషాద్రి.

"వాడింకా నిద్రపోతున్నట్టున్నాడు గదిలో" కామాక్షమ్మ సమాధానం.

"వాణ్ణి లేవమను" కోపంగా అరిచారు శేషాద్రి గారు.

మూర్తిని లేపేందుకు గబగబా అతని గదిలోకి వెళ్ళింది విజయ.

మూర్తి గదిలో లేడు.

ఎక్కడికెళ్ళాడో...!

లేడని శేషాద్రితో చెప్పడానికి వరండాలోకి పరుగుతీసిన విజయ గుమ్మంవద్దనే నిర్ఘాంతపోయి నిలబడి పోయింది.

కామాక్షమ్మగారు, కొయ్యబారిపోయి గుడ్లప్పగించి చూస్తున్నారు.

శేషాద్రి గుండాగినంత పనయింది.

పార్వతి...మూర్తి...పసుపు బట్టలతో దిగడిగి వస్తున్నారు.

అక్క మెడలో మంగళసూత్రం.

బావముఖంలో చిరునవ్వు.

మూర్తి అకాల ఆగమనం.

"రేపు మావయ్య వూహించనిది మరొకటి జరుగొచ్చు" అక్కయ్య మాటల్లో ఆంతర్యం అపుడుగాని బోధపడలేదు విజయకు.

తన ఆంతర్యం అర్థంచేసుకోని విజయను చూసి చిరునవ్వు నవ్వింది పార్వతి.

విజయ నూతన దంపతులకు ఎదురు వెళ్ళింది.

★

# "దీపోత్సవం"

దీపోత్సవం నేడు.
దివ్యోత్సవం నేడు
నవ్యోత్సవం నేడు
భవ్యోత్సవం నేడు.

2

బంగారు దీపికలు
భాగ్యాల దీపికలు
నిండారు ప్రతియింట
చెండాడు తిమిరాలు.

3

క్రొన్ననల చివురులై
క్రొక్కారు మెరుగులై
క్రొంబొద్దు రేఖలై
విరిసె దీపపుశిఖలు....

4

తెలుగు దీపపు శిఖలు
వెలుగు మణిహారాలు
తెలుగు వెలుగుల కివే
దీపించు నవరత్న మాలికలు.

5

ఏడేడు లోకాల
కీ దినమె సుదినమ్ము
వెలుగు రవ్వల బలిపి
తెలుగు భువినేలు.

6

నవజాగృతిని పొంది
నవరాగముల నంది
జనత కిలపర్వమై
కాంతి జ్యోత్స్నల కురిసియు.

—ముళ్ళపూడి నరసరాజు